ఆరుబయటే ధాన్యం

మార్కెట్లో కనీస సౌకర్యాలు కరువు..
- పెడ్లను వాడుకుంటున్న వ్యాపారులు
- అధికారుల కార్యాలయంగా విశ్రాంతి భవనం
- ఇబ్బందులు పడుతున్న రైతులు


షెడ్లలో నిల్వ ఉంచిన వ్యాపారుల ధాన్యం


రైతుల విశ్రాంతి భవనంలో కొనసాగుతున్న మార్కెట్ అధికారుల కార్యాలయం

నవాబుపేట: స్థానిక మార్కెట్‌యార్డుకు తెచ్చిన ధాన్యాన్ని రైతులు ఆరుబయటే నిల్వ ఉంచుతున్నారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లన్నీ వ్యాపారులు వాడుకుంటున్నారు. ప్రతివారం వేల సంఖ్యలో ధాన్యం బస్తాలను రైతులు మార్కెట్‌కు తీసుకు వస్తున్నారు. ధాన్యం తెచ్చిన రైతులు సేద తీరేందుకు కనీస సౌకర్యాలు కూడా లేవు. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్లో గతంలో రైతుల విశ్రాంతి కోసం కేటాయించిన భవనం 20ఏళ్లుగా మార్కెట్ అధికారుల కార్యాలయంగా మారింది. ప్రతి ఏడాది సీజన్‌లో రూ.50లక్షల వరకు ఆదాయం మార్కెట్‌కు వస్తోంది. అధికారులు మాత్రం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

జిల్లా అధికారులకు వివరిస్తాం

మార్కెట్‌యార్డుకు వచ్చే రైతుల సమస్యలను జిల్లా అధికారులకు వివరిస్తాం. తాగునీటి విషయంలో ఫిల్టర్ వాటర్ అందించే ఏర్పాటు చేస్తాం. కనీస సౌకర్యాల కల్పనపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రమేశ్, మార్కెట్ కార్యదర్శి, నవాబుపేట

వ్యాపారులు కొంటేనే షెడ్లలోకి..



రైతులు తెచ్చిన ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేశాక వాటిని షెడ్లల్లోకి వేస్తున్నారు. లేదంటే ధాన్యం ఆరుబయటే వేయాలి. రైతులకు మార్కెట్లో కనీస సదుపాయాలు లేవు. ధాన్యం విక్రయాల మూలంగా ఆదాయం సమకూర్చుకుంటున్న అధికారులు కనీస సౌకర్యాలు కల్పించకపోవటం విడ్డూరం.

– వెంకటేష్, రైతు, నవాబుపేట

క్లుప్తంగా

గిరిజన డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

జడ్చర్ల టౌన్: మండలంలోని మాచారం సమీపంలోని తెలంగాణ గిరిజన ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఐఎంఎస్‌సీ ప్రథమ ఏడాదిలో స్పాట్ అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.వి.మంజుల తెలిపారు. అడ్మిషన్ పొందాలనుకునే వారు ఇంటర్ బైపీసీ, ఎంపీసీల్లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత కావాలన్నారు. కళాశాలలో డిగ్రీలో అడ్మిషన్ పొందితే పీజీ పూర్తయ్యేవరకు ఇక్కడే చదువుకోవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 25వ తేదీ వరకు కళాశాలలో ఒరిజినల్ ధ్రువపత్రాలతో సంప్రదించాలని సూచించారు.

పరుగుపందెంలో రాణించిన విద్యార్థి


జీవన్

జడ్చర్ల టౌన్: వరంగల్‌లో ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్‌లో స్థానిక ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల విద్యార్థి అంకూరి జీవన్ పరుగుపందెంలో రాణించి పతకాలు సాధించాడు. 400మీటర్లు, 800మీటర్ల పరుగుపందెం రెండింటిలోనూ మూడవస్థానం దక్కించుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఉమా మ హేశ్వర్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థిని అధ్యాపకులు రామకృష్ణగౌడ్, రఘురాంలు అభినందించారు.

ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘానికి అనుబంధ పత్రం



మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఒలింపిక్ సంఘానికి మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఒలింపిక్ భవన్‌లో రాష్ట్ర ఒలింపిక్ సంఘం అనుబంధపత్రం (అఫిలియేషన్) అందజేసింది. ఈ మేరకు జనరల్ సెక్రటరీ జగదీష్‌యాదవ్ చేతులమీదుగా అనుబంధపత్రాన్ని అందుకున్నట్లు ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పీ.వెంకటేశ్, ఈ.కురుమూర్తిగౌడ్, కోశాధికారి ఉమామహేశ్వర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి బాబులాల్ తెలిపారు.

మాజీ మంత్రికి ఘన స్వాగతం

అడ్డాకుల: కురుమూర్తి స్వామి దేవాలయానికి వచ్చిన మాజీ మంత్రి హరీష్‌రావుకు మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రాల్లో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భూత్పూర్ మీదుగా వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అడ్డాకులలో హరీష్‌రావుతో సెల్ఫీలు దిగడానికి కార్యకర్తలు పోటీ పడ్డారు.

గ్రూప్‌-4 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇటీవల టీజీపీఎస్ నుంచి ఎంపికైన 8 మంది జూనియర్ అసిస్టెంట్లకు పాలమూరు యూనివర్సిటీలో బుధవారం సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ చెన్నప్ప మాట్లాడుతూ యూనివర్సిటీలో ఉద్యోగం సాధించినందుకు అభ్యర్థులను అభినందిస్తున్నామన్నారు. అంకిత భావంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. మిగతా డిపార్ట్‌మెంట్లతో పోల్చితే యూనివర్సిటీలో ఉద్యోగం బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, ఏఆర్ వెంకటేశ్వర్లు, రవికుమార్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సును జయప్రదం చేద్దాం



జడ్చర్ల టౌన్: గిరిజన ఉపాధిపై డిసెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించే జాతీయ సదస్సు జయప్రదం చేద్దామని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్ పిలుపునిచ్చారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు గిరిజనుల్లో పెరుగుతున్న నిరుద్యోగం, ఉద్యోగ భద్రతపై సంఘం అనుబంధ ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ ఢిల్లీలోని హెచ్‌కేఎస్ సూర్జిత్ భవన్‌లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు రాష్ట్రం నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో దీప్లానాయక్, చందునాయక్, జగన్, శ్రీకాంత్, సంతోష్, రాములు పాల్గొన్నారు.

ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు


మొదంపల్లిలో శివాలయాన్ని సందర్శించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: ప్రార్థనాలయాలను అపవిత్రం చేస్తే ఎంతటివారికైనా కఠిన చర్యలు తప్పవని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఓ వర్గానికి చెందిన ప్రార్థనాలయాన్ని అపవిత్రం చేసిన సంఘటన తెలిసిందే. బుధవారం మొదంపల్లి గ్రామంలోని అలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వర్గానికి చెందిన వారైనా ప్రార్థనాలయాల్లో ఇలాంటి సంఘటనలకు పాల్పడితే జైలుకు పంపుతామన్నారు. మొదంపల్లిలో ఇలాంటి ఘటన జరగటం బాధాకరమన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఆయన వెంట వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, తిరుపతి, దత్తుకుమార్, తదితరులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : ఎంపీ

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలం మొదంపల్లి గ్రామంలోని శివాంజనేయస్వామి దేవాలయంలో నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఆలయంలో శివుడి విగ్రహాన్ని కదిలించి, అపవిత్రం చేసిన ఇద్దరు యువకులను కఠినంగా శిక్షించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మొదంపల్లిలోని శివాంజనేయస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు కాపాడే పోలీసులు ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆమె పేర్కొన్నారు. ఎంపీతో పాటు నాయకులు రాబోతుల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సాటిశ్రీనివాస్, కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి


వంటశాలను పరిశీలిస్తున్న ఆర్‌ఎల్‌సీ

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని మైనార్టీ గురుకులాల ఆర్‌ఎల్‌సీ ఖాజా బావుద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్‌లో మైనార్టీ గురుకుల బాలికల కళాశాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తరగతిలో విద్యార్థులతో మాట్లాడారు. వంటశాలతో పాటు విద్యార్థినులు తినే భోజన హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఆయన వెంట ప్రిన్సిపల్ హాజీ సుల్తానా ఉన్నారు.

జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న 'సర్వే'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. బుధవారం 3,513 ఇళ్ల వద్దకు ఎన్యుమరేటర్లు వెళ్లి ఆయా కుటుంబ యజమానుల నుంచి పూర్తి వివరాలు సేకరించారు. మొత్తం 49 వార్డుల పరిధిలోని 78,696 ఇళ్లకు గాను ఇప్పటివరకు 48,611 ఇళ్లకు సంబంధించిన సర్వే పూర్తయింది.

విద్యార్థులు జాగ్రత్తగా వ్యవహరించాలి

భూత్పూర్: ప్రస్తుతం విద్యార్థులు సమాజం పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని మహబూబ్‌నగర్ చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సెలర్ యాదగిరి అన్నారు. బుధవారం భూత్పూర్ పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్‌లైన్ (1098) ఆధ్వర్యంలో పిల్లల హక్కులు, చట్టాలు వాటి అమలుపై ఆయన వివరించారు. ప్రస్తుతం సమాజంలో పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడుల నుంచి ఎలా రక్షణ పొందాలి, హక్కుల భంగం కల్గితే ఏ చట్టం నుంచి మనం రక్షణ పొందాలనే విషయాలు వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోషల్ మీడియా ఉపయోగం, సమస్యలు, ఏవిధంగా ఎదుర్కోవాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో చైల్డ్‌హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ శివకుమార్, డీసీపీయూ భాగ్యలక్ష్మి, హెచ్‌ఎం ఆనందమ్మ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని గెలక్సీ పాఠశాలలో బుధవారం ఘనంగా ప్రపంచ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జువైనల్ జస్టీస్ బోర్డు మెంబర్ గిరిజా ప్రీతి హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఇంటర్నెట్ సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలని ఏర్పరుచుకుని వాటిని సాధించేందుకు శ్రమించాలన్నారు. సభ్యసమాజంలో ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించకుండా ప్రతి ఒక్కరు స్వేచ్ఛను అను భవించేవిధంగా వ్యవస్థలో మార్పులు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాను ప్రతాప్, రమేష్, మంజుల, ఆఫ్రా తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న నాయకులు శిబిరం

జడ్చర్ల టౌన్: సత్యసాయిబాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయి మందిరంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 31మంది రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ ప్రారంభించారు. ఫ్లెవ్యాక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, సత్యసాయి సేవాసమితి కన్వీనర్ రామకృష్ణ, జిల్లా, స్థానిక పదాధికారులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగరసంకీర్తన, బోయిలకుంటలో గ్రామదర్శిని నిర్వహించారు. సాయంత్రం భజనలు, కీర్తనలు, ప్రసాద వితరణ చేశారు. గురువారం మధ్యాహ్నం నారాయణసేవలో భాగంగా దుస్తుల పంపిణీ, అన్నదానం, సాయంత్రం శివుడికి రుద్రాభిషేకం చేయనున్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి


వస్పుల ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మిడ్జిల్: పొగాకు ఉత్పత్తుల వల్ల వచ్చే అనర్థాలు, వాటి వల్ల వచ్చే రుగ్మతలపై బుధవారం మండల పరిధిలోని వస్పుల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇంట్లో తల్లిదండ్రులకు పొగాకు వల్ల కలిగే అనర్థాల గురించి వివరించి, వాటికి దూరంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, సంపత్, పీఈటీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జేపీఎన్‌సీఈలో ఎన్‌సీసీ క్యాంపు ప్రారంభం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని జేపీఎన్‌సీఈ కళాశాలలో నేటి నుంచి 10 రోజుల పాటు ఎన్‌సీసీ క్యాడెట్‌లకు క్యాంపు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏటీసీ -7 పేరుతో క్యాంపు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలు 240, బాలురు 360 మందికి వసతి కల్పించి ఫైరింగ్, డ్రిల్లింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నాల్ ఎస్‌కే సింగ్, మేజర్ కుల్దీప్‌సింగ్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

సైబర్ మోసాలకు గురి కావొద్దు


అడ్డాకులలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అడ్డాకుల: అపరిచిత వ్యక్తులు మొబైల్ ఫోన్లకు పంపే లింకులను క్లిక్ చేసి సైబర్ మోసాలకు ఎవరు గురి కావొద్దని ఏఎస్‌ఐ రాజేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బుధవారం అడ్డాకుల ఠాణా పోలీసులు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల పేర్లతో వచ్చే మోసపూరిత సెల్‌ఫోన్ కాల్స్‌కు అనవసరంగా సమాచారం ఇవ్వొద్దని ఏఎస్‌ఐ సూచించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా నంబర్లు, ఆధార్ నంబర్లను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దన్నారు. ఎవరైనా ఒకవేళ సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబరుకు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, కానిస్టేబుల్ రాజు, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు కలిగించొద్దు

- సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేయాలి
- మహమ్మదాబాద్‌లో పరిశీలించిన కలెక్టర్ విజయేందిర బోయి


హన్వాడలో ఎఫ్‌పీసీఎస్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహమ్మదాబాద్/హన్వాడ: ఖరీఫ్‌లో పండించిన వరిధాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గించకుండా కొనుగోలు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. బుధవారం మండలంలోని కొలింపల్లి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వరిధాన్యం కొనుగోలు, ధర ఎంత కేటాయిస్తున్నారనే విషయాలు పరిశీలించారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని వేర్వేరుగా తూకం చేయాలని, గుర్తు పట్టేలా ఉండాలని తెలిపారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48గంటలలోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం మహమ్మదాబాద్‌లో ఇంటింటి సమగ్ర సర్వేను కలెక్టర్ పరిశీలించారు. సర్వేలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. పై అధికారులు పరిశీలన ఎలా ఉందని తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ తిరుపతయ్య, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

ధాన్యం సేకరణలో ఇబ్బందికి గురిచేయొద్దు

వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా సేకరణ చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. హన్వాడ ఎఫ్‌పీసీఎస్‌లో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. 17శాతం లోపు తేమ, మట్టి లేకుండా నాణ్యతాప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ప్యాడీ క్లీనర్‌లను వినియోగించుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రైతుల వివరాలు ఓఎంపీఎస్ ఆన్‌లైన్‌లో నమోదు చేసి 48గంటల్లో ధాన్యం డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ


రఘుపతిశర్మతో ఆశీర్వదం పొందుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక చిన్నదర్పల్లిలోని లక్ష్మీ పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజలో పాల్గొని మాట్లాడారు. కార్తీక మాసంలో 41 రోజుల పాటు అయ్యప్ప దీక్షను భక్తులు అతి పవిత్రంగా స్వీకరించి, కఠిన నియమాలను ఆచరించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమానికి బ్రహ్మశ్రీ రఘుపతిశర్మ, అయ్యప్ప భక్తులు కుమార్‌స్వామి, కురుమూర్తిస్వామి, కమల్‌స్వామి తదితరులు హాజరయ్యారు.

లగచర్ల రైతులపై ప్రభుత్వ వైఖరి మారాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కొడంగల్ నియోజకవర్గం లగచర్ల రైతుల పట్ల ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక నిరంకుశ విధానాలనే రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తోందని ఆరోపించారు. లగచర్ల రైతుల పట్ల అమానుషంగా వ్యవహరించడం తగదని, రైతులను ఒప్పించి 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, మెప్పించి భూసేకరణ చేపట్టాలన్నారు. సంబంధం లేని రైతులపై కేసులు, దాడులు, రాత్రికి రాత్రే ఇళ్లపై పడి యువతీ యువకులను, గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రైతు సంఘం ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ అన్నం పెట్టే రైతులు ఆరుగాలం పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు మాట్లాడుతూ కార్మికులు, కష్టజీవులు సమస్యలపై ఉధృతమైన పోరాటాలు నిర్వహిస్తామని, ఈ నెల 26న జరిగే దేశవ్యాప్త నిరసన కార్యక్రమానికి సీపీఎం పూర్తి మద్దతు ప్రకటిస్తుందన్నారు. సమావేశంలో కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, పద్మ, మో హన్, జగన్, చంద్రకాంత్, రాజ్‌కుమార్, ప్రశాంత్, దీప్లానాయక్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

26న జిల్లా కేంద్రాల్లో మహాధర్నా


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి.సురేష్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆల్‌ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 26న మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి.సురేష్ తెలిపారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కార్మిక, కర్షక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్త మహాధర్నాలో భాగంగా జిల్లా కేంద్రంలో తెలంగాణ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని కుదించి అమలు చేయకుండా కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను తెచ్చి కార్మికులను దివాలా తీయించారని ఆరోపించారు. 26న జరిగే నిరసన కార్యక్రమంలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, వెంకటేశ్, జిల్లా రైతుసంఘం కార్యదర్శి లక్ష్మయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరద గాలెన్న, అమృత, అల్వాల్‌రెడ్డి, గణేశ్, చంద్రకాంత్, తిరుమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే లద్దెపురుగు నివారణ


సంగాయపల్లిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటేశ్

మహమ్మదాబాద్: రబీలో రైతులు వేరుశనగ పంట ఎక్కువగా సాగు చేసుకుంటున్నందున పంటలకు వచ్చే తెగుళ్ల నివారణ చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ తెలిపారు. బుధవారం మండలంలోని సంగాయపల్లి, మహమ్మదాబాద్ గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వేరుశనగ ఎక్కువగా సాగుచేసిన రైతులు వ్యవసాయాధికారుల సూచనలతో తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా పొగాకు లద్దెపురుగు పంటను నాశనం చేస్తున్నదని, అలాంటి పురుగు నివారణకు పంటలో ఆముదం మొక్కలు పెంచాలన్నారు . ఎకరానికి 20కిపైగా పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలన్నారు. గుడ్లు చిన్నలద్దెపురుగుల నివారణకు 5శాతం వేపగింజల కషాయం సాయంత్రం వేళలో పిచికారీ చేయాలన్నారు. లేదా క్వినాల్‌పాస్, క్లోరోఫైర్‌పాస్ మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. తెగుళ్ల, చీడపీడలపై పలు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నరేందర్, ఏఈఓలు పవన్, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానించిన ఉద్యోగులు


డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్ నగర్): డీఈఓగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను నాలుగో తరగ తి ఉద్యోగుల సంఘం జిల్లా అ ధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. బుధవారం డీఈ ఓ చాంబర్‌లో శాలువాతో స త్కరించి పూల మొక్కను అందజేశారు. ప్రభుత్వ శాఖలో నాలుగో తరగతి ఉద్యోగుల పాత్ర కీలకమని డీఈఓ అన్నారు. కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, కాశన్న, రాజశేఖర్, అంజప్ప, సంతోష్, సోయబ్ తదితరులు పాల్గొన్నారు.